క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడలో చేపూర్ దేవాయికి రూ. 23 వేలు, లొక్కిడి పెద్ద సాయిలుకు మంజూరైన రూ.12,500 సీఎం ఆర్ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు టక్కర్ గంగాధర్, సొసైటీ డైరెక్టర్ గట్టుపుతల నర్సారెడ్డి, నర్సయ్య, రాజేందర్, నరేశ, రమేష్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



వేల్పూర్: మండల కేంద్రంలో 2003 ఎస్సెస్సీ బ్యాచ్ వారు నిర్వహిస్తున్న హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ నూతన కార్యవర్గాన్ని శనివారం వేల్పూర్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రజనీకాంత్, ఉపాధ్యక్షుడిగా సురేశ్, కోశాధికారిగా సందీప్, ప్రధాన కార్యదర్శిగా వినోద్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



నవీపేట: మండల కేంద్రంలోని దర్యాపూర్ వీరాంజనేయ యూత్ ఆధ్వర్యంలో శ్రావణ మాస చివరి శనివారాన్ని పురస్కరించుకుని అన్నదానం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

బాడీ ఫ్రీజర్ వితరణ



బోధన్: పట్టణంలోని మున్సిపల్ 13 వార్డు ప్రజల సౌకర్యార్థం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆ వార్డు కమ్యూనిటీ హాల్‌లో శీతల శవపేటికను వితరణ చేశారు. క్లబ్ కోశాధికారి దొప్పలపూడి గోపాల్‌రావు తన తండ్రి పూర్ణచంద్రారావు జ్ఞాపకార్థంగా అందించారని క్లబ్ అధ్యక్షుడు కృష్ణ మోహన్ తెలిపారు. కార్యక్రమంలో బోధన్ కోర్టు రెండవ శ్రేణి న్యాయమూర్తి శేషతల్ప సాయి, మున్సిపల్ మాజీ చైర్మన్ మహ్మద్ గౌసొద్దీన్, క్లబ్ ప్రతినిధులు చక్రవర్తి, శ్రీనివాస రాజు, కేవీ సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు, ప్రసాద్, రాధాకృష్ణ మూర్తి, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన నాయకుల అరెస్ట్

ఇందల్వాయి: ఇందల్వాయి మండల సమీపంలో కోర్టు కేసులో ఉన్న ఓ వివాదస్పద భూమిలో తీజ్ ఉత్సవాల నిర్వహణకు సిద్ధమైన కొందరు గిరిజన నాయకులను ఇందల్వాయి పోలీసులు శనివారం ముందస్తు అరెస్ట్ చేసి వ్యక్తిగత పూచికత్తుపై విడిచిపెట్టారు.

కురుస్తున్న వర్షం.. ప్రవహిస్తున్న వాగులు

- పలుచోట్ల నిలిచిన రాకపోకలు
- కోటగిరిలో నీటమునిగిన పంట పొలాలు
- జాగ్రత్తగా ఉండాలంటున్న అధికారులు



రుద్రూర్ చిక్కడపల్లి అలుగు వద్ద చేపలు పడుతున్న యువకులు



ఉద్ధృతంగా ప్రవహిస్తున్న బొప్పాపూర్-రుద్రూర్ వాగు




రుద్రూర్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో వరద బాధితులు



డొంకేశ్వర్ మండలం కోమట్‌పల్లి వాగును పరిశీలిస్తున్న అధికారులు

డొంకేశ్వర్/ రుద్రూర్/ కమ్మర్‌పల్లి/ ఆర్మూర్ టౌన్/ వేల్పూర్/ బాల్కొండ/ పెర్కిట్/ బోధన్ రూరల్/ రెంజల్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. కురుస్తున్న వర్షానికి గ్రామాల్లోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. వరద పంట పొలాల్లోకి వచ్చి చేరుతోంది. ప్రమాదాలు జరగకుండా రోడ్డుకు ఇరువైపులా జీపీ సిబ్బంది పలు వాహనాలు అడ్డుగా పెడుతూ కాపలా ఉంటున్నారు. డొంకేశ్వర్ మండలం కోమట్‌పల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కోమట్‌పల్లి–నికాల్‌పూర్ గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కోటగిరి, పోతంగల్, రుద్రూర్ మండలాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రుద్రూర్ మండల కేంద్రంలో మూడు నివాసపు గృహాల్లోకి వరద చేరడంతో స్థానిక బాలికల హైస్కూల్‌లో పునరావాసం కల్పించారు. చిక్కడపల్లి, రుద్రూర్ చెరువులు నిండి అలుగులు ప్రవహిస్తున్నాయి. బొప్పాపూర్ వెళ్లే రహదారిలోని లో లెవల్ వంతెన పై నుంచి వరద ప్రవహిస్తుండడంతో రహదారి గుండా రాకపోకలు నిలిపివేశారు. కమ్మర్‌పల్లి నుంచి ఉప్లూర్ వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టును అధికారులు కలిసి పరిశీలించి రోడ్డుకిరువైపులా భారీకేడ్లను ఏర్పాటు చేశారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు జలమయంగా మారాయి. వేల్పూర్ మండలం జాన్కంపేట్ చెక్‌డ్యాముకు వరద వచ్చి చేరింది. బాల్కొండ మండల పరిధిలో 27 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బాల్కొండ, మెండోరా మండల కేంద్రాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు. పెర్కిట్, బోధన్, రెంజల్ మండలాల పరిధిలోని ముంపు గ్రామాలను అధికారులు పరిశీలించి ప్రజలకు పలు సూచనలు చేశారు.



బాల్కొండ: కొత్తపల్లి శివారులోప్రవహిస్తున్న ఒర్రె



ఆర్మూర్‌లో కురుస్తున్న వర్షం



హుస్నాబాద్ కాలనీలో గుంతల్లో చేరిన వర్షపు నీరు



బోధన్: హంగర్గలో పర్యటిస్తున్న అధికారులు

ప్రజలను అప్రమత్తం చేయాలి



ఆర్మూర్‌లో ఎంపీడీవోతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్

పెర్కిట్: భారీ వర్ష సూచనతో ఆర్మూర్ మండలంలోని అధికారులను, ప్రజలను అప్రమత్తం చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ ఎంపీడీవో శివాజీకి సూచించారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో శివాజీతో రక్షణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం వీడియో కాల్ ద్వారా గ్రామ కార్యదర్శులతో మాట్లాడి గ్రామాల్లో పరిస్థితులను తెలుసుకున్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆలూర్‌లో పాక్షికంగా దెబ్బతిన్న కుటుంబాన్ని పునరావాస కేంద్రానికి తరలిస్తున్న అధికారులు



కమ్మర్‌పల్లి, ఉప్లూర్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టును పరిశీలిస్తున్న అధికారులు



కందకుర్తి వద్ద గోదావరి నదిలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు, పోలీసులు



పోతంగల్: కొల్లూరు-దోమలెడ్గి వాగు వద్ద ప్రవహిస్తున్న వరదను పరిశీలిస్తున్న అధికారులు



మంథని-దేగాం గ్రామాల మధ్య లోలెవెల్ వంతెనను పరిశీలిస్తున్న అధికారులు

పచ్చని పొలాల్లో.. పొంచి ఉన్న ముప్పు



సాలూర శివారులోని గజిగన్‌కుంట పొలాల్లో వంగిపోయి ఉన్న విద్యుత్ స్తంభాలు

- సాలూర శివారులో వంగిన విద్యుత్ స్తంభాలు

బోధన్: సాలూర మండల శివారులోని పచ్చని పంట పొలాల్లో వంగిపోయిన విద్యుత్ స్తంభాలతో ప్రమాదకరంగా మారాయి. రైతులు, పశువుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్న పరిస్థితులున్నాయి. గ్రామ ప్రధాన కూడలి బస్టాండ్ సమీపంలో గజిగన్ కుంట, నివాసాల అంచున ఉన్న పంట పొలాల్లో స్తంభాలు పూర్తిగా వంగిపోయి తీగలు వదులుగా వేలాడుతున్నాయి. ఏ క్షణమైనా కూలిపోయే పరిస్థితి ఉంది. మంజీర నది తీరాన ఉన్న అంతరాష్ట్ర చెక్ పోస్టుకు ప్రాంతంలోని వర్షాధార మెట్టభూముల్లో విద్యుత్ స్తంబాలు వంగిపోయి ఉన్నాయి. పంట పొలాల్లో వెళ్లే రైతులు, పశువుల ప్రాణాలకు నష్టం జరిగే అవకాశాలున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



అంతర్రాష్ట్ర చెక్ పోస్టు ప్రాంతంలో..

ప్రయాణం.. ప్రాణ సంకటం

- అధ్వానంగా రెంజల్ రోడ్లు
- వర్షపు నీటితో కనిపించని గుంతలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందిపడుతున్న వాహనదారులు

రెంజల్: మండలంలోని రోడ్లపై ప్రయాణం ప్రాణ సంకటంగా తయారైంది. బైక్‌లు, ఆటోలు, కార్లలో వెళ్లినా అడుగుకో గుంతతో ఒళ్లు గుల్లవుతోంది. నిత్యం ప్రయాణించే వారు వెన్ను నొప్పితో బాధపడుతున్నారు. వర్షాకాలంలో ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంది. వర్షపు నీరు గుంతల్లో నిలిచిపోవడంతో ఇది గమనించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎడపల్లి మండలం దూపల్లి గేట్ నుంచి రెంజల్ మండలం దండిగుట్ట వరకు అడుగుకో గుంత ఏర్పడింది. అంతేకాకుండా సాటాపూర్ నుంచి కందకుర్తి, సాటాపూర్ నుంచి నవీపేట్ మండలం ఫకీరాబాద్ గ్రామాల రహదారులు సైతం అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. అధ్వానంగా మారిన రోడ్లతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులు మాత్రం పర్యవేక్షణ కరువైంది. ప్యాచ్ వర్క్‌లు చేయించాల్సిన అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు. దెబ్బతిన్న రోడ్లను పట్టించుకునే వారు కరువయ్యారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.



దూపల్లి గ్రామం వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలు



కందకుర్తి మార్గంలో రోడ్డుపై ఏర్పడిన గుంత

ప్యాచ్ వర్క్‌లు చేయించాలి



కందకుర్తి నుంచి సాటాపూర్ రావడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు ప్యాచ్ వర్క్‌లు చేయిస్తే కనీసం రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి. వాహనాలు నడపాలంటు నడుము, వెన్నుపూస నొప్పులు వస్తున్నాయి. – ఇమాంబేగ్, కందకుర్తి నీలా విండో చైర్మన్

వర్షాలు తగ్గిన తర్వాత..

వర్షాలు తగ్గిన వెంటనే పనులు పూర్తి చేయిస్తాం. దూపల్లి రోడ్డుకు ఎఫ్‌డీఆర్ పథకం కింద నిధులు మంజూరయ్యాయి. రెండేళ్లుగా ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. అప్పటి వరకు ప్యాచ్ వర్క్ పనులు చేయిస్తాం. – రాంమోహన్‌రావ్, ఆర్అండ్‌బీ డీఈఈ

గుంతల చింత తీరేదెన్నడు



నల్లూర్ శివారులో పెద్దవాగు రోడ్డుపై ఏర్పడిన గుంతలు

బాల్కొండ: ముప్కాల్ మండలం నల్లూర్ చౌరస్తా నుంచి పెద్ద వాగు వరకు ఉన్న డబుల్ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో గుంతల చింత తీరేదెన్నడు అంటు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా నల్లూర్ శివారులో, కొత్తపల్లి శివారులో రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



బోధన్‌లో ఇస్కాన్ ఆధ్వర్యంలో..

ఇస్కాన్ ఆధ్వర్యంలో ..

బోధన్: ఇస్కాన్ సంస్థ బోధన్ శాఖ అధ్వర్యంలో శనివారం పట్టణ కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై రాధకృష్ణుల విగ్రహామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

బోధన్‌లో..

పట్టణ కేంద్రంలోని బీటీనగర్ ప్రాంతంలో గల శ్రీ కోట మైసమ్మ సహిత లక్ష్మి నర్సింహస్వామి ఆలయ వ్యవస్థాపకుడు పసుపులేటి గోపికిషన్ అధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు.



బోధన్ బీటీనగర్ కాలనీలో ఉట్టికొడుతున్న చిన్నారులు



గోవూరులో ఉట్టి కొడుతున్న యువకుడు



ఎడపల్లి: జానకంపేటలో



అద్వైత్, లియాన్స్(మోర్తాడ్)



బాల్కొండలో యాదవ సంఘం ఆధ్వర్యంలో



ముప్కాల్: సరస్వతి శిశు మందిర్‌లో ఉట్టి కొడుతున్న విద్యార్థులు



బాల్కొండలో కృష్ణ మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

మాక్లూర్/ పెర్కిట్/ వేల్పూర్/ రెంజల్/ మోర్తాడ్/బాల్కొండ/ బోధన్/ వర్ని: కృష్ణాష్టమి వేడుకలను ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గ ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉట్టి కొట్టారు. చిన్నారులు కృష్ణుడు, బాలికలు గోపికల వేషధారణలో అలరించారు. మాక్లూర్ మండలంలోని మండలంలోని బోర్గాం(కె), మాక్లూర్, గొట్టిముక్కల, అమ్రాద్, అడవి మామిడిపల్లి గ్రామాల్లో శ్రీకృష్ణ ఆలయాల ఎదుట ఉట్టిలను కట్టి సంబురాలు చేపట్టారు. ఆర్మూర్, ఆలూర్ మండలాలతో పాటు మంథని గ్రామంలో, వేల్పూర్ మండలం పడగల్, మోతె గ్రామాల్లో, రెంజల్ మండలంలోని బోర్గాంలో, మోర్తాడ్, ఏర్గట్ల, భీమ్‌గల్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా, బోధన్, ఎడపల్లి మండలాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



జానకంపేటలో శ్రీకృష్ణుడు,రాధ ,గోపికల వేషధారణలో చిన్నారులు



రెంజల్: బోర్గాంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు



ఆర్మూర్ మండలం మంథనిలో..



మాక్లూర్‌లో..



పడగల్ యాదవసంఘం ఆధ్వర్యంలో..



మోతె విజ్ఞాన్‌స్కూలులో విద్యార్థులు

గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా జరిగేలా చూడాలి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సర్వసమాజ్ ప్రజా ఐక్య సమితి నవనాథపురం అధ్యక్షులు కొట్టాల సుమన్, ప్రధాన కార్యదర్శి దినేశ్, ఎలిగేటి చక్రధర్ శనివారం ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. చిన్నపిల్లలు, వృద్ధులకు ఇబ్బందిగా మారే డీజే సౌండ్ సిస్టంను నిషేదించాలని అలాగే పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని మండపాల నిర్వాహకులకు పోలీసులు సూచించారు.